# ధృవతార

**-డా॥ భండారు ఉమామహేశ్వరరావు**

**క**రువు. అరువు పుట్టని కరువు. పరువేకాదు ప్రాణాలు తీసే కరువు. ఎత్తిపోతలూ, హైటెక్ అభివృద్ధీ నివారించలేని కరువు.

పంటలు పండక, పండినా ధర రాక ఆత్మహత్యలు.

ఇవి చాలవన్నట్లు ఎన్‌కౌంటర్లు. ప్రతీకారంగా పోలీసుల హత్యలు. బస్సు దహనాలు. రైళ్ళ పేల్చివేతలు. ప్రకృతి నుంచి సంపాదించిన వనరులను మనుషులే అనుభవిస్తున్నారు. మళ్ళీ వాళ్ళే ఏదో రూపాన నాశనం చేస్తున్నారు.

నలభై ఐదు సెంటిగ్రేడు డిగ్రీల ఎండ. ఉదయం పదకొండు గంటలు దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యం. బంద్ పిలుపిచ్చిన వాతావరణం.

పల్లెల నుంచి వలస వస్తున్న ప్రజలు శరణార్థుల్లా ఫుట్‌పాత్‌ల మీద... చెట్ల కింద.. రైల్వే ప్లాట్‌ఫారాలపైన... పోలీసులతో, మునిసిపాలిటీ సిబ్బందితో తిట్లూ దెబ్బలూ తింటూ ఎంత నికృష్టమయిన పనిచేసి అయినా ఒకపూట తిండి గడుపుకోవటానికి సిద్ధంగా ఉన్నారు.

కూలర్‌లో నుంచి గోరువెచ్చని గాలి. ఎన్నిసార్లు నీళ్ళు పోసినా అంతే. సూర్యుడు డైరెక్టుగా కూలర్‌లో కూర్చున్నట్లు ఆవిర్లు.

"సార్ పేషంటు వచ్చింది. పంపియ్యమంటారా!" అన్నాడు కాంపౌండర్.

"పంపించు..."

ఒక ఆడమనిషి చిన్నపాపను తీసుకొచ్చింది లోపలకు.

"ఏమైందమ్మా?" అని అడిగాడు డాక్టరు మాధవ్.

పిల్లగానికి వాంతులయితానయి సారూ. దొడ్డికి కూడా పెడతాంది. ఐదారు మల్కల. నీల్లకు నీల్లే. ఈడపోతే ఆడపడతాంది" అన్నది తల్లి.

డాక్టరు మాధవ్ ఆ పిల్లవాణ్ణి పరీక్ష చేసి "ఒంట్లో నీరంతా పోయిందమ్మా! దవాఖాన్ల ఉంచాలె. గుల్‌కోజెక్కియ్యాలె" అన్నాడు.

"దవాఖాన్లనా! నాతోటేమయితది సారూ! మందులు రాసియ్యరాదు నీ దండం పెడతా" అన్నది ఆమె దీనంగా. "రెణ్ణెల్ల పొల్లను ఇంటికాడుంచొచ్చిన బాంచెను. చూసుకునేటోల్లు లేరు. పైసలు కూడ చానలేవు. అధాట్నొచ్చిన అన్నది మళ్ళీ.

## పత్రిక విశేష సంచిక!

**అ**క్టోబరు 2006 సంచికతో పత్రిక మన మాస పత్రిక ఆరవ సంవత్సరంలో అడుగు పెడుతుంది. ఆ నెలలోనే విజయదశమి, దీపావళి రెండు పెద్ద పండుగలు రావడంతో పత్రిక జన్మదినోత్సవానికి మరింత నిండుతనం చేకూరనున్నది.

మీ అందరూ యిచ్చిన ప్రోత్సాహాన్ని వుత్సాహంగా అనువదించుకుని, అయిదేళ్లు మన మాస పత్రిక నిరాటంకంగా నడిచింది. సాహిత్య విలువలతో వెలువడే పత్రికగా మీ అందరి మనసుల్లో సుస్థిర స్థానాన్ని పొందడం మా అదృష్టం. ఈ అయిదేళ్లలో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు మూడు రెట్లు పెరిగినా, పత్రిక తన సాహిత్య విలువను తప్ప, రూపాయలలో ముఖ విలువను పెంచుకోలేదు. పత్రిక తయారీలో, గెటప్‌లో రాజీ పడలేదు. దీనిని గుర్తించిన అభిమా నులందరికీ కృతజ్ఞతలు.

ప్రతి సంవత్సరంలాగే పత్రిక మన మాస పత్రిక పెద్ద సైజులో, అధిక పేజీలతో, మూడు పర్వదినాల సందడితో అక్టోబరు సంచికగా వెలువడుతుంది. విడిప్రతి వెల పది రూపాయలు. సంవత్సరం చందా (రూ. 60/-) దారులకు యథావిధిగా విశేష సంచిక అందుతుంది. ప్రత్యేక సంచిక కోసం కథలు, కవితలు, కార్టూన్లు, వ్యాసాలు పంపి సహకరించాల్సిందిగా రచయితలను కోరుతున్నాం. రచనలు తప్పనిసరిగా పండుగల ప్రస్తావనతో వుండాలన్న నియమం లేదు. మీ రచనలు సెప్టెంబరు 5వ తేదీలోగా అందాలని మనవి. కవరుపై 'విశేష సంచికకు' అని స్పష్టంగా రాయండి.

పంపాల్సిన చిరునామా:

**ఎడిటర్, మోనిక పబ్లికేషన్స్**

103, నవ నిర్మాణ్ నగర్, రోడ్ నెం. 71,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500 033.

"పోనీ సర్కారు దవాఖానకు రాసిస్త పోతవా."

"ఓ! నీ దండం పెడతా సారూ! మా పెద్ద పిల్లగాడు ఆణ్ణే పోయిండు. ఆనాడు ఆరుగురు సచ్చిండ్రు ఒకనాడే. ఒద్దు సారూ ఒద్దు."

"అయితే మరేమంటవ్. ప్రైవేటుగ ఉంచుతవా- మందులు రాసియ్యాల్నా!" అన్నాడు మాధవ్ ఆఖరు మాటగా.

"మందులు రాసియ్యి! వాళ్ళ నాయిన గూడతడు." డా॥ మాధవ్ ఇక అవన్నీ వినదల్చుకోలేదు. అప్పటికే కాంపౌండర్ ఒకసారి తొంగిచూసి పోయాడు. అంటే బయట ఇంకా పేషంట్లు ఎదురు చూస్తున్నారు.

ఆ తల్లికి ఎంత చెప్పినా వినేట్టు లేదు. నిజంగా పైసలు ఉన్నావో లేవో. కాని మంత్రాలు, తాయెత్తులు, విభూదులు, దేవుని కొంటెతనం, ఊర్లో సూదులేసే డాక్టరు వీటన్నిటి ముందూ ఇంకా పల్లె ప్రజల్లో ఆధునిక వైద్యం రెండవ శ్రేణి వైద్యం కిందే లెక్క.

ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే తప్పక చస్తారని ఒక నిశ్చితాభిప్రాయం.

ప్రైవేటు ఆస్పత్రికి వెళితే బిల్లు కట్టలేక చచ్చినంత పనవుతుందని గాభరా.

మందులు రాసిన కాయితం ఆమె చేతికిచ్చాడు మాధవ్.

"ఒస్త బాంచెను. ఉంచేటి దాన్నేగని వాళ్ళనాయిన కూడ లేడు ఒంటరిదాన్ని. ఇక ఆ దేవుని దయ."

రెండవసారి కూడా ఆమె తండ్రి లేడని వత్తి పలికేసరికి డా॥ మాధవ్‌లో కుతూహలం కలిగింది.

"వాళ్ళనాయిన ఎటుపోయినాడు?"

"తెల్వదు"

"అదేంటమ్మా!"

"అవును సారూ! నెల రోజులాయె. అర్ధరాత్రి నిద్రపోతాంటె వచ్చి తీస్కపోయిండ్రు!"

"ఎవరు?"

"ఎమ్మో!" అన్నతర్వాత ఆమె కంఠంలోంచి మాట రాలేదు కాని కళ్ళలోంచి నీరు కారుతోంది.

"అదేంటమ్మా! ఎవరు తీసుకపోయినారో తెల్వదా?" అన్నాడు డా॥ మాధవ్ మళ్ళీ ఆశ్చర్యంగా.

"నిజంగ తెల్వదు సారూ!"

"పోలీస్‌స్టేషన్ల రిపోర్టియ్యలే."

"ఇచ్చినం. కాని ఊర్లె పెద్దమనుషులంటాండ్రూ... అన్నలతో తిరుగుతాండని పోలీసులే మాములు బట్టలల్ల ఒచ్చి తీస్కపోయిండ్రుగావచ్చు" అని.

"మరి పోలీసులను అడగలే"

"అడిగిన"

"ఏమన్నరు"

"ఇదివరకు నీ మగడు అన్నలతో తిరిగిండుగద. ఇప్పుడు బైటకొచ్చి మంచిగనే ఉంటాండుగద. వాళ్ళ సంగతులు మాకు చెప్తాండని వాళ్లే వచ్చి తీస్కపోయి నట్టున్నది" అన్నారు.

పేపర్లలో చదవటమే కాని ఇటువంటి సంఘటన నిజజీవితంలో తారసపడటం వింత అనుభవం.

కొంగుతో ముఖం తుడుచుకుంటున్నట్లు కళ్ళు తుడుచుకుని ఒక్క క్షణం ఆగింది ఆమె. ఏదో ఒక భారమయిన మాట చెప్పటానికి ధైర్యం కూడదీసుకుం టున్నట్లు ఉంది ఆమె ముఖం. సగం తడి సగం పొడి కలసిన రుద్ధ కంఠంతో చెపుతోంది.

"ఆఖరికి శవం కోసానికిసుతా ఎతికినం. మా సుట్టుపక్కల అడవుల్లల్ల, కొండల్లల్ల, బావుల్లల్ల, పొలాల్లల్ల అంత వెతికినం." ఇప్పుడు ఆమె ఏడుపు ఆపుకోవటానికి ప్రయత్నించటల్లేదు.

"పోనీ! అన్నలను బతిలాడుకుంట పేపర్ల ఇయ్యకపోయినవ్."

"అవన్ని చేసిన సారూ! వాళ్ళేడనో అవుల్లల్ల ఉం టరాయె. ఆడదాన్ని. ఇద్దరు పోరగాల్లనేసుకొని యాడికి పోను."

ఆమెకు న్యాయం చెప్పేవాడు కాదు డా॥ మాధవ్. చెప్పటానికి అతినికీ అంతా అగమ్యగోచరంగా ఉంది. కర్మను తప్ప ఎవరినీ నిందించేటట్లు లేదు.. ఆ కర్మ ఆమె భర్త చేసిన దుష్కర్మ మాత్రం కాదు.

"వొస్త సారూ... పోతాన్.." అంటూ వెళ్ళి పోయింది. ఆమె వెళ్తున్నప్పుడు వెనకనుంచి చూస్తే బుజాలెగరేసుకుంటూ వెళుతున్నదనిపిస్తుంది చూసే వాళ్ళకు. కాని ఆమె ఎక్కిళ్ళు పెడుతున్నదని డా॥ మాధవ్‌కు తెలుసు.

ఇటువంటి నిర్భాగ్యులకు రెండే రెండు మార్గాలు.. భర్తను తలుచుకుంటూ జీవితమంతా మోడులా గడపటమో.. ధైర్యం కోల్పోయి అంతా ఉరిపోసుకు చనిపోవటమో... విచిత్రమేమిటంటే రెండు జరుగు తూనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతూనే ఉన్నాయి. తీర్మానాలు చేస్తూనే ఉన్నాయి. న్యాయపోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.

■